సాక్షి పెద్దపల్లి
శనివారం ׀ 11 ׀ మార్చి ׀ 2023



కలెక్టర్‌ను కలిసిన ఆర్జీ-2 జీఎం

గోదావరిఖని: కలెక్టర్ సంగీతసత్యనారాయణను ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ శుక్రవారం కలిశారు. పెద్దంపేట్ గ్రామ సమస్యలపై చర్చించారు. జీఎం వెంట సీనియర్ ఎస్టేట్ అధికారి సునీత, సురేశ్ బాబు ఉన్నారు.



పత్తి క్వింటాల్‌కు రూ.7,380

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో శుక్రవారం పత్తి క్వింటాలుకు గరిష్ట ధర రూ.7,380, కనిష్ట ధర రూ.6,500, సరాసరి ధర రూ.7,250 నమోదైంది.

గరిష్టం/కనిష్టం
34.0/19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటి పూట ఎండగా ఉంటుంది.

పేదల ఉసురు తగులుతుంది

కేసీఆర్ ఈ గ్రామసభతోనైనా కళ్లు తెరవాలి

- ఇక్కడికి ఓట్లు అడిగేందుకు రాలేదు.. భూ సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా
- ధరణి లోపాలను సరిచేసి పేదలను ఆదుకోవాలి
- పేదలకు భూములు పంచి, హక్కులు కల్పించి, ఆత్మగౌరవం నిలిపింది కాంగ్రెస్ పార్టీయే
- 'ధరణి అదాలత్' గ్రామసభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- బాధితులకు గ్యారంటీ కార్డులు పంపిణీ



సభకు హాజరైన సుల్తాన్‌పూర్ గ్రామస్తులు



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

సాక్షి, పెద్దపల్లి/ఎలిగేడు: 'సీఎం కేసీఆర్‌కు పేదల ఉసురు తగులుతుంది.. ధరణి లోపాలను సరిచేసి ఆదుకోవాలి.. ఈ గ్రామసభతోనైనా కళ్లు తెరవాలి' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. 'సుల్తానాపూర్ గ్రామానికి ఓట్లు అడిగేందుకు రాలేదు.. ధరణి పోర్టల్‌తో బాధపడుతున్న మీ సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా' అని పేర్కొన్నారు. 'మీ సమస్యలు నమోదు చేసుకొని, కాంగ్రెస్ తరఫున గ్యారంటీ కార్డులు అందించి, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పడానికి వచ్చా' అని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారిగా శుక్రవారం ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామంలో మీభూమి- మీహక్కు నినాదంతో 'ధరణి అదాలత్' గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, తెలంగాణ వ్యవహారాల చైర్మన్ మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, కొప్పుల రాజు, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, విజయరమణారావు, సిరిసిల్ల రాజయ్య, మహేశ్‌కుమార్‌గౌడ్, నీలిమా, సౌజన్య తదితరులు పాల్గొన్నారు. ధరణి బాధితులతో మాట్లాడి వారికి కాంగ్రెస్ పార్టీ తరఫున గ్యారంటీ కార్డులు పంపిణీ చేశారు.

ధరణితోనే సమస్యలు

'ధరణి అదాలత్' గ్రామసభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో గ్రామానికో 20 నుంచి 30 సమస్యలుంటే నేడు 200 నుంచి 300 భూ సమస్యలు ధరణితో ఏర్పడ్డాయన్నారు. పేదలకు భూములు పంచి, హక్కులు ఆత్మగౌరవం కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచిన భూములను కేసీఆర్ కుటుంబీకులకు, భూస్వాములకు కట్టబెడుతుంటే తమ పార్టీ చూస్తూ కూర్చోదన్నారు. బాధితుల తరఫున పోరాడి పట్టాలు అందించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ధరణి పోర్టల్‌తో వేలాది కోట్లు కేసీఆర్ బంధువుల చేతుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. వాళ్లందరికీ బేడీలు వేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం తెచ్చి భూములు ఉన్న వారినే కాకుండా, ఆ గ్రామంలో ఉన్న ఇతర కుల వృత్తుల వారిని సైతం ఆదుకునేలా రూపకల్పన చేసింది జైరాం రమేశ్ అని వివరించారు. ఈ చట్టాలకు ప్రస్తుతం కేసీఆర్, మోదీలు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



కాంగ్రెస్ గ్యారంటీ కార్డును అందజేస్తున్న నాయకులు



రేవంత్‌రెడ్డికి నాగలి బహూకరిస్తున్న విజయరమణరావు, నాయకులు

అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి



రాష్ట్రంలో మన భూమి మనకు దక్కాలంటే అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధరణితో న్యాయపరమైన సమస్యలు వస్తాయని మేం చెప్పినా ఈ ప్రభుత్వం వినలేదు. కాంగ్రెస్ హయాంలో లక్షలాది మందికి అసైన్డ్ భూములు ఇచ్చాం. ధరణి పేరుతో అసైన్డ్ భూములను పేదలకు కాకుండా చేశారు. 20లక్షల ఎకరాల భూమి అన్యాక్రాంతం అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ధరణి సమస్యలు నమోదు చేసుకుని బాధితులకు గ్యారెంటీ కార్డులు అందిస్తాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మీ సమస్యలు పరిష్కారమవుతాయి.- శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే

మూడెకరాలు సాగులో ఉన్నాం.. పట్టాలివ్వాలి



2009లో తమ కుటుంబసభ్యుల పేరుమీద మూడెకరాలు ప్రభుత్వం ఇచ్చింది. అప్పటి నుంచి పహనీలో, కబ్జా కాలంలో ఉన్నప్పటికీ ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత ఆ కాలమ్ తీసేశారు. పూర్తిస్థాయిలో భూమిని సాగు చేసుకుంటున్నప్పటికీ పట్టాదారు పాసుపుస్తకాలు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలను అందజేయాలి. - ముద్రవేణి సంపత్, రైతు

ఆప్షన్ లేదంటున్నారు



14 ఏళ్ల క్రితం ఇతరుల వద్ద ఎకరం భూమి కొన్నాం. పట్టా చేసి పాస్‌బుక్ తీసుకున్నాం. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత 30గుంటలే చూపిస్తుంది. 10గుంటలు ఆన్‌లైన్‌లో చూపించడంలేదు. సరి చేయాలని కార్యాలయాల చుట్టూ తిరిగిన ఆప్షన్ రాలేదంటున్నారు. 10గుంటల భూమిని ఆన్‌లైన్‌లో సరిచేయాలి.
- అప్పాల సాగర్, రైతు

పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాలి




2009లో కాంగ్రెస్ ప్రభుత్వం 20 గుంటల లావోణి పట్టా ఇచ్చింది. ఇప్పుడున్న ప్రభుత్వం ధరణి పోర్టల్ తేవడంతో ఆన్‌లైన్‌లో నమోదు కావడంలేదు. కొత్త పాస్‌బుక్కులు ఇవ్వడంలేదు. మా భూమికి ప ట్టాలు ఇవ్వాలి.
- గౌరు శైలజ, మహిళ రైతు

సాదాబైనామా కింద కొన్న..



గ్రామంలో 20 గుంటల భూమిని సాదాబైనామా కింద కొన్న. గతంలో ఆర్ ఓఆర్‌పట్టా చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చేది. ధరణితో ఇబ్బందులు తప్పడంలేదు. 20గుంటలు మోకాపై చూసి పట్టా చేసేందుకు అవకాశం ఇవ్వాలి. - గోష్కి రాయలింగు, రైతు

ఆన్‌లైన్ చేయడం లేదు



తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని నా ఆట పాటలతో ఎన్నో సభలు, సమావేశాల్లో పాల్గొని ప్రజలను చైతన్యపరిచిన. ఉద్యమకారునికి ప్రభుత్వం ఇచ్చిన భూమిని పట్టా చేయడం లేదు. 2009లో అప్పటి ప్రభుత్వం 10 గుంటల భూమి ఇచ్చి, పట్టాదారు పాసుపుస్తకం అందజేసింది. ధరణి పోర్టల్ వచ్చినప్పటినుంచి, ధరణిలో నా పేరుమీద భూమిని చూపించడంలేదని కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదు. ఆన్‌లైన్ చేయడం లేదు - పల్లె రాజేశం, తెలంగాణ ఉద్యమ కళాకారుడు

న్యూస్‌రీల్

శిక్షణ ఐఏఎస్‌లకు వీడ్కోలు



వీడ్కోలు పలుకుతున్న గ్రామస్తులు

జూలపల్లి(పెద్దపల్లి): గ్రామీణ స్థాయిలో శిక్షణ నిమిత్తం మండలంలోని కుమ్మరికుంటకు ఆరు రోజుల క్రితం వచ్చిన శిక్షణ ఐఏఎస్‌లు అభిజిత్‌శర్మ, నితేశ్ మిశ్రా, కమలేశ్ కుమార్, రాహుల్, మిహిర్‌కు శుక్రవారం గ్రామస్తులు వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ, శిక్షణ నిమిత్తం వచ్చిన ఐఏఎస్‌లతో గ్రామంలో నూతనోత్తేజం వచ్చినట్లుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోశ్‌రావు, ఎంపీడీవో వేణుగోపాలరావు, మండల ప్రత్యేకాధికారి రంగారావు, ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, ఎంపీవో కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించి అవగాహన పొందిన శిక్షణ ఐఏఎస్‌లను పంచాయతీ పాలకవర్గం శుక్రవారం శాలువాలతో సన్మానించింది. కార్యక్రమంలో సర్పంచు బండ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆర్‌ఐల బదిలీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రామగుండం, రామగిరి మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న రమ్యశ్రీ, సంపత్‌కుమార్‌ను బదిలీ చేస్తూ కలెక్టర్ సంగీత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామగిరిలో ఆర్‌ఐ-1గా విధులు నిర్వర్తిస్తున్న సంపత్‌కుమార్‌ను రామగుండం ఆర్‌ఐ-2గా, రామగుండంలో ఆర్‌ఐ-2గా పనిచేస్తున్న రమ్యశ్రీని రామగిరి ఆర్‌ఐ-1 గా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే ఉన్నత శిఖరాలకు..



మాట్లాడుతున్న సునీల్‌కుమార్ దాదే

జ్యోతినగర్(రామగుండం): విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ సునీల్‌కుమార్ దాదే(మహారాష్ట్ర-పూణే) అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు అనుసరించవలసిన విధానాలను తెలియజేశారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ జ్ఞానచంద్, హెచ్‌ఎం ఆరస్‌జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురస్కారానికి ఎంపిక



విజయలక్ష్మి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): మంథని మండలం కూచిరాజ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మికి చంద్రమోహన్ పురస్కారం వరించింది. గత పదేళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో పలు సేవలందిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి చంద్రమోహన్ స్మారక పురస్కారాలు అందిస్తున్నట్లు వసుంధర విజ్ఞాన వికాస మండలి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాకుడు వైద్యుల మధుకర్ తెలిపారు. ఈనెల 12న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో విజయలక్ష్మి పురస్కారం స్వీకరించనున్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చందర్



గోదావరిఖని(రామగుండం): రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రామగుండం నియోజకవర్గ పర్యటనకు రావాల్సిందిగా ఆహ్వానించగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. శుక్రవారం రాత్రి సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం విజయ్‌రావు,మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత తదితరులు పాల్గొన్నారు.

పది జీపీఏ లక్ష్యంగా సన్నద్ధం కావాలి

మంథని: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివితే పది జీపీఏ లక్ష్యం సాధిస్తారని డీఈవో మాధవి అన్నారు. శుక్రవారం మంథనిలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరీక్షలకు సమయం దగ్గర పడడంతో ఈ మిగిలిన రోజులు టీవీలు, సెల్‌ఫోన్లు, ఫంక్షన్లు, ప్రయాణాలకు దూరంగా ఉండాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. సైకాలజీ రిసోర్స్‌పర్సన్లు మూల మహేందర్‌రెడ్డి, బొట్ల రామస్వామి, ఎంఈవో లక్ష్మి, హెచ్‌ఎంలు హరిప్రసాద్, కానుగంటి శ్రీనివాస్, శ్రీదేవి, జిల్లా సెక్టోరియల్ కోఆర్డినేటర్ జక్కం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

కమాన్‌పూర్(మంథని): సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా మండలంలోని గుండారంలో ఆమె చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. సర్పంచ్ ఓదెలు, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీవో శేషయ్య, నవీన్, భారతి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనతో విద్యార్థులకు మేలు

రామగిరి(మంథని): గ్రామీణ పని, అనుభవ కార్యక్రమాలు అగ్రికల్చర్, హార్టికల్చర్ విద్యార్థులకు చాలా ఉపయోగపడతాయని రామగిరి ఖిలా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్, హెడ్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ముత్తారం మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గ్రామీణ పని, అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సును నిర్వహించినట్లు వివరించారు. విద్యార్థులు 4 నెలలు పాటు రైతులతో అనుసంధానమై ప్రాక్టికల్‌గా రైతులు అవలంబించే పద్ధతుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి కొత్త టెక్నాలజీని చేరవేసే క్రమంలో వారి అనుభవాన్ని పంచుకునేందుకు వీలుంటుందన్నారు. ముత్తారం గ్రామాన్ని కేవీకే దత్తత తీసుకుందని, దీంతో చాలా వరకు అభివృద్ధి కార్యక్రమాలను గ్రామంలో చేపడుతున్నామని వివరించారు. కా ర్యక్రమంలో ఎంపీపీ ముత్తయ్య, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, మంథని ఏడీఏ మురళి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







పార్వతీ రాజరాజేశ్వరుల కల్యాణోత్సవం, రాజన్నను వివాహమాడుతున్న జోగినులు, రాజన్న కల్యాణంలో పాల్గొన్న శివపార్వతులు, భక్తులు

కల్యాణ వైభోగమే..

- అంగరంగ వైభవంగా ఆదిదంపతుల వివాహ వేడుక
- ఉప్పొంగిన భక్తజన హృదయాలు
- రాజన్నను పెళ్లాడిన శివపార్వతులు
- లక్ష మందికి పైగా తరలివచ్చిన భక్తులు
- పనిచేయని ఎల్‌ఈడీలు.. ఎండలో ఇబ్బందిపడ్డ భక్తులు
- రేపు రథోత్సవం

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో శుక్రవారం ఆది దంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తుల జయజయ ధ్వానాల మధ్య వివాహ వేడుకను అర్చకులు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. చేతిలో త్రిశూలం, బాసింగాలతో శివపార్వతులు రాజన్నను కల్యాణం చేసుకోగా.. వేలాది మంది తరలివచ్చిన హిజ్రాలు తలంబ్రాలు పోసుకుంటూ సందడి చేశారు. కల్యాణోత్సవంలో భాగంగా మున్సిపల్ తరఫున చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు, అధికారులు స్వామికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు దాదాపు రెండున్నర గంటల పాటు కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ వేదిక ఆలయ ఆవరణలో వేయడంతో వేలాది మంది భక్తులు ఆరుబయట ఎండలోనే ఉన్నారు. అధికారులు ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్స్ పనిచేయలేదు. ఎంత తీవ్రంగా ఉండడం.. కనీసం టెంట్లు కూడా వేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. కన్యాదాతలుగా గోపన్నగారి వసంత్- సరిత దంపతులు, వ్యాఖ్యాతగా తిగుళ్ల శ్రీహరిశర్మ, చంద్రగిరి శరత్ వ్యవహరించారు. భక్తుల ద్వారా రూ.80 వేల కట్నాలు స్వామివారికి వచ్చినట్లు పీఆర్‌వో చంద్రశేఖర్ తెలిపారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు వెంకటేశ్, బన్సీలాల్, కౌన్సిలర్లు, పట్టణంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

రేపు రథోత్సవం

శివ కల్యాణోత్సవంలో భాగంగా మూడో రోజు శనివారం ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, అభిషేకాలు, పారాయణాలు, బలిహరణం, సాయంత్రం శివ పురాణ ప్రవచనాలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం 3.05 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ట్రైనీ ఐఏఎస్‌లకు సన్మానం



ట్రైనీ కలెక్టర్‌లను సన్మానిస్తున్న అధికారులు

ధర్మారం: మండలంలోని పత్తిపాక గ్రామంలో ట్రైనీ ఐఏఎస్‌లను శుక్రవారం సర్పంచు బద్దం సుజాత ఆధ్వర్యంలో అధికారులు ఘనంగా సన్మానించారు. శిక్షణలో భాగంగా పత్తిపాకలో వారంరోజులు వివిధఅంశాలపై అధ్యాయనం చేసిన ట్రైనీ కలెక్టర్లను గ్రామస్తులతో పాటు అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమ జయశీల, ఎంపీవో రమేశ్, ఐకేపీ పీవో అనిత, పంచాయతీ కార్యదర్శి శిరీషా గ్రామస్తులు పాల్గొన్నారు.

అవ్వ అందరికీ ఆదర్శం

- నేత్రదానంతో ఇద్దరికి చూపు



అభినందన పత్రం అందిస్తున్న ప్రతినిధులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేముల మధునమ్మ(75) వృద్ధురాలు మరణించినా.. ఆమె నేత్రాలు మరో ఇద్దరికి చూపును ప్రసాదించాయని ఫౌండేషన్ ప్రతినిధి లింగమూర్తి అన్నారు. శుక్రవారం 14వ డివిజన్ లక్ష్మీపురంలోని సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మధునమ్మ సంస్మరణ సభ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మధునమ్మ నేత్రాలు దానం చేయడానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను అభినందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు లింగమూర్తి, రాజమౌళి, కే.ఎస్.వాసు ఆధ్వర్యంలో నేత్రదాతకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందించారు. సమాజ హితం కోసం మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేయడానికి అందరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలి



రాజ్యలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: కళాశాలలతో సంబంధం లేకుండా హాల్‌టికెట్లను ఇంటర్‌బోర్డ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని బీసీ విద్యార్థిసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి డిమాండ్ చేశారు. ఈమేరకు సంఘం నాయకులు శుక్రవారం డీఐఈవో రాజ్యలక్ష్మికి వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. ఫీజులు చెల్లించడం లేదనే సాకుతో కార్పొరేట్ కళాశాలలు విద్యార్థులకు హాల్‌టికెట్లను ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఫీజులు చెల్లించని వారికి నిరాకరిస్తున్నారని...దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. విద్యార్థులు స్వయంగా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. స్పందించిన జిల్లా ఇంటర్‌బోర్డు అధికారి టి.రాజ్యలక్ష్మి శనివారం నుంచి హాల్‌టికెట్లు విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకునేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బియ్యాని తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి బోయిని ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించడం పోలీసుల కర్తవ్యం



మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి

జ్యోతినగర్(రామగుండం): ప్రజలకు సేవలందించడమే పోలీసుల కర్తవ్యమని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాలులో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల డీసీపీలు, ఏసీపీలు, సీఐలతో ఏర్పాటు చేసిన నేర సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలో 'పీపుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలన్నారు. న్యాయపరమైన ఫిర్యాదులపై అధికారులు కేసులు నమోదు చేయడం ద్వారా ఫిర్యాదుదారులకు పోలీసులపై నమ్మకం కలుగుతుందని తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలో కళాశాలలు, స్కూల్స్ జాబితా తయారు చేసి విద్యార్థులకు యుక్త వయసులో తాత్కాలిక ఆనందాల కోసం ఆకర్షణ తదితర విషయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించాలి

కమ్యూనిటీ పోలీసింగ్, నేను సైతం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు నిర్వహణ, బీట్ పోలీసింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్, బీట్స్ ద్వారా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మంచి సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఫంక్షన్ వర్టికల్స్, విధుల్లో ప్రతిభ కనబరచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు వైభవ్ గైక్వాడ్, సుధీర్ కేకన్, ఏసీపీలు గిరిప్రసాద్, తిరుపతిరెడ్డి, నరేందర్, సదయ్య, మోహన్, బాలరాజ్, వెంకటేశ్వర్లు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా పెద్దపల్లి జోన్ మంథని యూనిట్‌కు చెందిన హోంగార్డ్ ఆర్.దేవేందర్ 2022లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, సోషల్ సెక్యూరిటీ స్కీమ్‌లో భాగంగా రూ.5 లక్షల విలువగల చెక్కును అతడి భార్య వరలక్ష్మికి సీపీ అందజేశారు.

ఉద్యమాలతోనే హక్కులు సాధన



మాట్లాడుతున్న నరేశ్, నాయకులు

- ఈనెల 18, 19న ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభలు
- ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఈదునూరి నరేశ్

జ్యోతినగర్: ఉద్యమాలతోనే కార్మికులు హక్కులు సాధిస్తారని కార్మికవర్గానికి ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పెద్దపల్లి జిల్లాకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల పక్షాన ఐఎఫ్‌టీయూ 40ఏళ్లుగా పోరాటం చేస్తూనే ఉందన్నారు. కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న తీరును ఎండగట్టేందుకు ఐఎఫ్‌టీయూ 8వ జిల్లా మహాసభలను ఈనెల 18, 19న ఎన్టీపీసీ రామగుండంలోని టీవీ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నామన్నారు. మహాసభల్లో గత ఉద్యమాలను సమీక్షించి భవిష్యత్ పోరాటాలను రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం చైతన్యవంతమై మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభల్లో జిల్లాలోని అన్నిరంగాల కార్మికులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పెద్దపల్లి కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి చిలుక శంకర్, జిల్లా నాయకులు దుర్గయ్య, బుచ్చయ్య, అబెద్నెగో, బుచ్చమ్మ, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు

సిరిసిల్లక్రైం: వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున కూరగాయలతో ఉన్న టీఎస్ 16 యూసీ 2292 నంబర్ గల బొలెరో వాహనం ఎండీ ముక్తార్ అనే వ్యక్తి పెద్దూరు మీదుగా సిరిసిల్ల మార్కెట్‌కు అతివేగంగా వస్తూ, అదుపు తప్పి పలువాహనాలు, చిరు వ్యాపారుల గుడిసెను, సూర రమేశ్ అనే వ్యక్తిని ఢీకొట్టింది. గాయాలపాలైన రమేశ్ ఫిర్యాదు మేరకు ముక్తార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

ఒకరు అదృశ్యం

సిరిసిల్లక్రైం: వ్యాపారం నిమిత్తం అప్పు చేసి వాటిని తీర్చలేక మనస్తాపంతో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం ప్రగతినగర్‌కు చెందిన పొట్టవర్తిని అశోక్ మెడికల్ షాపు పెట్టేందుకు తెలిసిన వారివద్ద అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు షాపు నుంచి తగిన ఆదాయం రాలేదు. దీంతో మదనపడిన అశోక్ గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

పొలంలోనే పోయిన ప్రాణాలు

మెట్‌పల్లి(కోరుట్ల): పంట పొలంలో యూరియా చల్లేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతంతో పొలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మొట్టచిట్టాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర లింగం(51)కు గ్రామ శివారులో పొలం ఉంది. ఈ యాసంగిలో వరి సాగుచేశా డు. ఎప్పటిలాగే శుక్రవారం తన పంట పొలం వద్దకు వెళ్లాడు. పంటకు యూరియా చల్లుతూ ముందుకు సాగుతున్నాడు. అయితే, అప్పటికే పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగ తగిలింది. షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతు రు ఉన్నా రు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేర కు ఎస్సై శ్యామ్‌నాయక్ కేసు నమోదు చేసుకున్నారు.

ఖేలో కరీంనగర్.. జీతో కరీంనగర్

- క్రీడా పోటీలు ప్రారంభం



పరిచయం చేసుకుంటున్న కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: క్రీడలతో స్నేహం, మానసిక ఉల్లాసం, శరీర ధారుడ్యం కలుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలో కరీంనగర్.. జీతో కరీంనగర్ పార్లమెంట్ క్రీడోత్సవాలను శుక్రవారం కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ... క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ ఈవెంట్స్ ఈనెల 20 వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ క్శాం వాసుదేవరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల అంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు మాడ వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కల్యాణ్, ఊగిలే సుధాకర్, ఎడమ సత్యనారాయణరెడ్డి, కటకం లోకేశ్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దురిశెట్టి సంపత్ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, కటకం లోకేశ్, బండ రమణారెడ్డి, దుబాల శ్రీనివాస్ నాంపల్లి శ్రీనివాస్ కూర మహిపాల్‌రెడ్డి, రమణారెడ్డి, వరాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎం శ్రీలేఖకు మహిళా విశిష్ట పురస్కారం ప్రదానం



పురస్కారం అందిస్తున్న శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్‌కల్చరల్: ప్రముఖ సంగీత దర్శకురాలు, గాయనీ ఎంఎం శ్రీలేఖకు శుక్రవారం ఫిలింభవన్‌లో కఫిసో మహిళా విశిష్ట పురస్కారం–2023ను కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ప్రదానం చేశారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మహిళా లఘు చిత్ర పోటీల్లో గెలుపొందిన లఘుచిత్రాలకు బహుమతులు ప్రదానంచేశారు. ప్రథమ బహుమతి 'మొగుళ్లకు తగ్గ పెళ్లాలు', ద్వితీయ బహుమతి 'అమ్మాయి', తృతీయ బహుమతి 'వైనావైఫా', లఘు చిత్రాలు అందుకున్నాయి.'ముద్దబంతి' 'ఉసురు' 'నందిని', 'సీతాలు', 'ఆడపులి' చిత్రాలు కన్సోలేషన్ బహుమతులకు ప్రదానం చేశారు. కఫిసో అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు నంది శ్రీనివాస్, కేఎస్ అనంతాచార్యలు, జ్యూరీ సభ్యులుగా పీఎస్.రవీంద్ర, పొల్సాని వేణు గోపాలరావు, తోట నిర్మలారాణి, కె.లక్ష్మీగౌతం, పెనుగొండ సరసిజ, ఆడువాల సుజాత, కఫిసో ప్రధానకార్యదర్శి కె.లక్ష్మీ గౌతం తదితరులున్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

- హన్మకొండలో ప్రమాదం.. రామకృష్ణకాలనీలో విషాదం





సత్యనారాయణ రెడ్డి మృతదేహం (ఫైల్)

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణ కాలనీకి చెందిన వడాల సత్యనారాయణరెడ్డి హన్మకొండ జిల్లా లో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని కరీంనగర్‌కు బైక్‌పై వెళ్తుండగా భీమారం ఎర్రగట్టు గుట్టవద్ద వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారంతో కుటుంబ సభ్యులు హన్మకొండకు వెళ్లి బోరున విలపించారు.

నేత్రాలు సజీవం..

పుట్టెడు దుఃఖంలో ఉన్న సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులను రామాయమ్మ ఇంటర్నేషనల్ ఐబ్యాంక్, ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు ఒప్పించి ఆయన నేత్రాలు సేకరించారు. దీంతో కుటుంబ సభ్యులను గ్రామస్తులు, పలువురు అభినందించారు. శుక్రవారం సత్యనారాయణరెడ్డి అంత్యక్రియలు రామకృష్ణ కాలనీలో నిర్వహించగా గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గతంలో ఆయన ప్రైవేట్ పాఠశాల నడిపించగా పూర్వ విద్యార్థులు పెద్దఎత్తున హాజరై చిన్ననాటి గురువుకి కన్నీటి వీడ్కోలు పలికి నివాళులు అర్పించారు.

బొగ్గుబాయి వార్తలు

కార్మికుల డిప్యూటేషన్‌లో చేతివాటం

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణి కార్మికుల డిప్యూటేషన్ పేరుతో గుర్తింపు యూనియన్ నాయకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ విమర్శించారు. శుక్రవారం ఆర్జీ–1 సీఎస్‌పీలో గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా పలు డిపార్ట్‌మెంట్లలో సర్ఫేస్ ఖాళీలను శాశ్వతంగా భర్తీచేయాలని డిమాండ్ చేశారు. ఆరునెలల పాటు డిప్యూటేషన్ మూలంగా గుర్తింపుసంఘం నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. తాము గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు 24వేల మంది కార్మికులకు పదోన్నతి కల్పించామన్నారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని ఆదరించాలని కోరారు. అనంతరం పలువురు నాయకులు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. గేట్ మీటింగ్‌లో నాయకులు నర్సింహారెడ్డి, సదానందం, ధర్మపురి, గుమ్మడి కుమారస్వామి , వంగ లక్ష్మిపతిగౌడ్, వికాస్ కుమార్, రాజేందర్, టైసన్, ఎట్టెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఉద్యోగులుగా గుర్తింపు తెచ్చుకోవాలి



అభ్యర్థులకు కారుణ్య నియామక పత్రాలను అందజేస్తున్న ఆర్జీ3 ఎస్‌ఓటూ జీఎం రఘుపతి

రామగిరి(మంథని): సింగరేణి సంస్థలో క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ మంచి ఉద్యోగులుగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆర్జీ3 ఎస్‌ఓటూ జీఎం జి.రఘుపతి సూచించారు. ఆర్జీ3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల డిపెండెంట్‌లు 13 మందికి శుక్రవారం సెంటినరీకాలనీలోని జీఎం కార్యాలయంలో ఇద్దరు యువతులతో పాటు 11 మంది యువకులకు కారుణ్య నియామక పత్రాలు అందించారు. టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గౌతం శంకరయ్య, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ కే. మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం

- జేఏసీ నాయకుల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కౌశికహరి

గోదావరిఖని: ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమ్మెను మరింత ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కౌశికహరి హెచ్చరించారు. శుక్రవారంతో ఓబీ కార్మికుల సమ్మె 5వ రోజుకు చేరడంతో వారికి మద్దతుగా మాట్లాడారు. ఐదురోజులుగా సమ్మె చేస్తున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్మికల సమస్యల పరిష్కారంపై కాంట్రాక్ట్ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఈ సందర్భంగా జేఏసీ ఆధ్వర్యంలో ఫైవింక్లయిన్ చౌరస్తా నుంచి గోదావరిఖని ప్రధాన చౌరస్తా వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బుర్ర తిరుపతి, వేల్పుల కుమారస్వామి, పూసాల తిరుపతి, ఎ.వెంకన్న, తోకల రమేశ్, మద్దెల శ్రీనివాస్, గౌస్, శనిగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుదిరిన ఒప్పందం

గోదావరిఖని: సింగరేణి ఓబీ కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుపై ఒప్పందం కుదిరింది. గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి సమక్షంలో సింగరేణి యాజమాన్యం, ఆర్ఎల్‌సీ, ఓబీ కాంట్రాక్టర్లు, కాంట్రాక్టు కార్మిక సంఘాల మధ్య సుదీర్ఘంగా జరిగిన చర్చలు జరిగాయి. దీంతో ఐదు రోజులుగా కొనసాగిన సమ్మె విరమించారు. సమ్మెలో ఉన్న ఐదు రోజుల వేతనాలు కార్మికులకు చెల్లించడం, కార్మికుల స్థాయిని బట్టి రూ.1500 నుంచి రూ.2వేల వరకు పెంచేందుకు అంగీకారం కుదిరింది. దీంతో రామగుండం రీజియన్‌లో ఉన్న సుమారు 3వేల మంది ఓబీ కాంట్రాక్టు కార్మికులు శనివారం నుంచి విధులకు హాజరు కానున్నట్లు జేఏసీ నాయకుడు కౌశికహరి తెలిపారు.

సింగరేణిలో కోడ్‌ఆఫ్ డిసిప్లేన్ రద్దుచేయాలి

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: సింగరేణిలో కోడ్‌ఆఫ్ డిసిప్లేన్ వెంటనే రద్దుచేసి అన్ని కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సింగరేణిలో ఎన్నికలపై ఈనెల13 అన్ని కార్మిక సంఘాలతో ఆర్ఎల్‌సీ సమావేశం సందర్భంగా చర్చించాల్సి అంశాలపై సమీక్షించారు. డిసెంబర్‌లో ఆర్ఎల్‌సీ వద్ద అన్ని సంఘాలతో చేసుకున్న ఒప్పందాలు మారుపేర్ల మార్పు, డిపెండెంట్‌ల వయసు 35 నుంచి 40 ఏళ్లకు పెంపుతో పాటు పలు సమస్యలపై ఏలాంటి సర్క్యులర్ ఇవ్వలేదన్నారు. అమలుకు పూర్తిస్థాయిలో సర్క్యులర్లను ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో మహేశ్, వేణుగోపాల్‌రెడ్డి, ఆరెపల్లి రాజమౌళి, అన్నం శ్రీనివాస్, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

31లోగా మెడికల్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

రామగిరి(మంథని): ఈ నెల 31లోగా మెడికల్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31 వరకు యాజమాన్యం చివరి అవకాశం కల్పించిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు ఆయా గనుల పర్సనల్ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవానలి కోరారు.

ఉత్తములుగా ప్రశంసా





రామగుండం సీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న మంథని ఎస్సై వెంకటేశ్వర్లు, రామగిరి ఎస్సై రవిప్రసాద్

మంథని/రామగిరి: రామగుండం కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు జనవరి నెల రివార్డు మేళాలో మంథని, రామగిరి పోలీస్ స్టేషన్ అధికారులకు ఫంక్షనల్ వర్టికల్ విభాగంలో ప్రశంసలు అందాయి. శుక్రవారం ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో మంథని ఎస్సై అప్పని వెంకటేశ్వర్, రామగిరి ఎస్సై కటికె రవిప్రసాద్ ఉత్తమ స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా ఎంపికవడంతో రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ప్రశంశా పత్రాలు అందించారు.

గుండెపోటుతో ఎలక్ట్రీషియన్ మృతి



మధు(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ తారకరామా నగర్‌లో నివసిస్తున్న కాసర్ల మధు(45) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధు 30 ఏళ్లుగా కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో ఎలక్ట్రీకల్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగా గుండెపోటు రావడంతో కిందపడిపోయాడు గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కాలనీలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.